క్లుప్తంగా

భూ సమస్య పరిష్కరించండి



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

భీమిని: మండలంలోని తంగళ్లపల్లి గ్రామంలో మోఖాపై ఒకరు, భూ రికార్డుల్లో మరొకరి పేర్లు ఉండడంతో భూ భారతిలోనైనా తమ సమస్య పరిష్కరించాలని రైతులు మంగళవారం రెవెన్యూ అధికారులకు విన్నవించారు. సర్వే నంబర్ 1 నుంచి 50వరకు 300ఎకరాల పెద్ద పట్టా, 300ఎకరాల లావాణి పట్టా మొత్తం 600ఎకరాల భూమి డిస్ప్యూట్‌లో పెట్టారని, ఈ భూ సమస్యను భూ భారతిలోనైనా పరిష్కారం చూపాలని వేడుకున్నారు. మాజీ సర్పంచ్, అధికారులపై పలు ఆరోపణలు చేశారు. కార్యక్రమంలో డీటీ గోవర్ధన్, సీనియర్ అసిస్టెంట్ కొండయ్య, రైతులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలను అప్‌గ్రేడ్ చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఎంసీపీఐ(యూ) శ్రేణులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి ఎస్.రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పి.వెంకటేష్ డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను సందర్శించిన ఎమ్మెల్యే వినోద్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఇంజనీరింగ్ కళాశాల మంజూరుకు ఎమ్మెల్యే కృషి చేయాలని కోరారు. విద్యార్థులు, ఇందిరమ్మకాలనీ ప్రజలు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ హామీలు అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

నస్పూర్: గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన బీసీ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. సీసీసీ కార్నర్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజన్నయాదవ్, శాఖపురి భీంసేన్, శివతి రాములు, అంకం సతీష్, చెలిమెల అంజన్న తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన నేతకాని నాయకులు



ఎంపీ వంశీకృష్ణను సన్మానిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణను జిల్లాకు చెందిన నేతకాని మహర్ సేవా సంఘం నాయకులు మంగళవారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ఎంపీ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో నేతకాని సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. జిల్లా కేంద్రంలో నేతకాని ఆత్మగౌరవ భవనం నిర్మాణానికి రూ.50లక్షల నిధులు కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నేతకాని మహర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం స్వామి, ప్రధాన కార్యదర్శి దుర్గం సిద్దార్థ రామ్మూర్తి, జిల్లా అధ్యక్షుడు గోమాస శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు గట్టు శివలింగం, నాయకులు ఉన్నారు.

కంటి వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రామకృష్ణాపూర్: లయన్స్ క్లబ్ ఆఫ్ రామకృష్ణాపూర్ ఆధ్వర్యంలో పట్టణంలోని బీజోన్ లక్ష్మి గణేష్ మండలి మండపం వద్ద మంగళవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. సుమారు 150మందికి కంటి పరీక్షలు చేశారు. ఆపరేషన్ అవసరమున్న 35మందికి ఉచిత రవాణా కల్పించి రేకుర్తి కంటి ఆసుపత్రికి పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సుగుణాకర్‌రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు రాజేష్‌కన్నా, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, కిష్టయ్య, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మూగబోయిన కంట్రోల్ రూమ్



జన్నారం: అడవిలో అటవీ అధికారులు, బేస్‌క్యాంపు సిబ్బంది తిరిగే వివరాలను ఎప్పటికప్పుడు సేకరించడం, స్మగ్లింగ్, వేటపై ఎప్పటికప్పుడు డివిజన్ స్థాయిలో సమాచారం చేరవేసే కంట్రోల్ రూమ్ నేడు మూగబోయింది. జన్నారం గత ఎఫ్‌డీవో మాధవరావు ఉన్నప్పుడు ప్రతీ బీట్ అధికారికి వాకి టాకీ ఇచ్చి, జన్నారం రేంజ్, తాళ్లపేట్ రేంజ్ పరిధిల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. బీట్ అధికారులకు డ్యూటీలు ఇచ్చి, కంట్రోల్ రూమ్‌లో ఉన్న వ్యక్తి ఎప్పటికప్పుడు సమాచారం సేకరించేవారు. కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందగానే, ఆయన సంబంధిత అధికారికి సమాచారం చేరవేసేవారు. ఇలా స్మగ్లింగ్‌ను నిరోధించారు. అయితే గత సంవత్సరం కాలంగా వాకీటాకీలతో పాటుగా కంట్రోల్ రూమ్ నిర్వహణ లేక మూగబోయింది. అధికారులు దృష్టి పెట్టి, కంట్రోల్ రూమ్ నిర్వహణకు సిబ్బందిని నియమించి పూర్వ వైభవం తీసుకురావాల్సిన అవసరం ఎంతైన ఉంది.

కోటపల్లి: మండలంలోని ఎదులబంధం గ్రామంలో ప్రధాన రహదారి ఆనుకొని మురుగు నీటి కుంట కంపు కొడుతోంది. ఇళ్ల మధ్యనే ఉండడంతో చుట్టూ ఉన్న కాలనీవాసులు దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నట్లు వాపోయారు. మురుగు నీటి కుంటను పూడ్చాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మురుగునీటి కుంట.. దుర్వాసనతో తంట



సూపర్‌బజార్ మూసివేత

- 8 నెలలుగా షటర్ బంద్
- ఇబ్బంది పడుతున్న కార్మికులు



మూతపడిన నస్పూర్ కాలనీలోని సింగరేణి సూపర్‌బజార్

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికుల సంక్షేమంలో భాగంగా కాలనీల్లో ఏర్పాటు చేసిన సూపర్‌బజార్‌లు క్రమంగా మూతపడుతున్నాయి. సంస్థగతంగా ఉన్న లోపాలను సాకుగా చూపి ఆ సేవలను కనుమరుగు చేసే ఆలోచనలో కంపెనీ ఉంది. శ్రీరాంపూర్ ఏరియా పరిధిలో ప్రగతి మైదానం వద్ద చాలా ఏళ్ల క్రితమే సూపర్‌బజార్‌ను ఏర్పాటు చేయగా, నస్పూర్‌కాలనీ వాసుల సౌకర్యార్థం 5ఏళ్ల క్రితం కొత్త హంగులతో మరో సూపర్‌బజార్‌ను ఏర్పాటు చేశారు. నస్పూర్ కాలనీలో కొత్తగా ఏర్పాటు చేశామనే సాకుతో శ్రీరాంపూర్ ప్రగతి మైదానం వద్ద ఉన్న సూపర్‌బజార్‌ను రెండేళ్ల క్రితమే మూసివేశారు. మొదట్లో బాగానే నిర్వాహణ చేసిన అధికారులు, 8నెలల క్రితం దీన్ని కూడా మూసివేశారు. సిబ్బంది కొరత మూలంగా మూసివేసామని, త్వరలోనే తెరుస్తామని మొదట్లో చెప్పిన అధికారులు ఇప్పటికీ తెరవడం లేదు.

రిటైర్మెంట్‌తో సిబ్బంది ఖాళీ..

సింగరేణి వ్యాప్తంగా గ్యాస్ సరఫరా, నిత్యవసర సరుకుల కోసం సూపర్‌బజార్ ద్వారా సేవలు అందుతున్నాయి. ఇది ప్రత్యేక సొసైటీ కింద కొనసాగుతుంది. ఇందులో పనిచేసే ఉద్యోగుల జీత భత్యాలు అన్ని కూడా సొసైటీ చెల్లిస్తుంది. చాలా సూపర్ బజార్లలో లెక్కల్లో అవకతవకలు జరిగాయి. సిబ్బంది డబ్బులు సొంతంగా వాడుకొన్నారనే ఫిర్యాదులు వచ్చాయి. కంపెనీవ్యాప్తంగా పలు సూపర్ బజార్లలో జరిగిన అవినీతి వ్యవహారాలపై విచారణ చేస్తున్నారు. ఈ క్రమంలో వీటిని వదిలించుకోవాలని యాజమాన్యం ఆలోచనలో ఉంది. ఇందులో భాగంగానే సిబ్బంది కొరత సాకుతో నస్పూర్‌కాలనీలో ఉన్న సూపర్‌బజార్‌ను మూసివేశారు. ఇందులో పనిచేసే ఉద్యోగి రిటైర్డ్ అయ్యారు. ఆయన స్థానంలో కొత్తవారిని తీసుకోవడం లేదు. దీంతో మూతపడింది. సూపర్‌బజార్ మూసివేయడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. ఉద్యోగులకు నెలాఖరులో నగదు లేకుంటే ఉద్దెర క్రింద కూడా సరుకులు ఇస్తారు. వేతనంతో ఈ బిల్లులు కట్ చేసుకుంటారు. నేడు సూపర్‌బజార్ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని కార్మికులు వాపోతున్నారు.

కావాలనే మూసివేస్తున్నారు..

యాజమాన్యం కావాలనే సింగరేణివ్యాప్తంగా సూపర్‌బజార్లను మూసివేస్తుంది. సిబ్బంది కొరత పేరుతో నస్పూర్ కాలనీలోని సూపర్‌బజార్‌ను తెరువకపోవడం సరికాదు. వెంటనే సిబ్బందిని నియమించి సూపర్‌బజార్‌ను తెరువాలి.

– పీ.రాజేంద్రప్రసాద్, హెచ్ఎమ్మెస్ జాయింట్ సెక్రెటరీ

సిబ్బంది కొరతతోనే..

సిబ్బంది కొరత మూలంగానే సూపర్ బజార్‌ను మూసివేశాం. దీన్ని తెరిపించాలా, మూసి వేయాలా అనే దానిపై కార్పొరేట్ అధికారులు చర్చిస్తున్నారు. వారి ఆదేశాల అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటాం.

– ఎం.శ్రీనివాస్, జీఎం, శ్రీరాంపూర్

అతిసార నివారణకు చర్యలు తీసుకోవాలి



నస్పూర్: అవగాహన కల్పిస్తున్న అధికారులు



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

నస్పూర్: అతిసార నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్. అనిత తెలిపారు. పట్టణ పరిధిలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో 'స్టాప్ డయేరియా' పేరుతో అతిసార నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అతిసార నివారణకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా చేతులు తరుచూ సబ్బుతో శుభ్రపరుచుకోవాలన్నారు. శుభ్రమైన నీరు తాగాలని సూచించారు. రోటా వైరస్, తట్టుకు టీకాలు వేయించాలన్నారు. ఓఆర్ఎస్‌ను తయారు చేసుకునే విధానాన్ని తెలిపారు. జింక్ ఉపయోగాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో అధికారులు కృపాబాయి, వెంకటేశ్, సమత, వెంకటేశ్వర్లు, పలువురు ఆశాలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

అతిసార వ్యాధిపై అవగాహన

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఏసిసి 3 అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అతిసార వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం నాగలక్ష్మి మాట్లాడుతూ.. వానాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పిల్లలు డయేరియా(అతిసారం) బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఎన్. పద్మ, సహాయకురాలు లత పాల్గొన్నారు.

సమాచారం

• నేడు కూరగాయల మార్కెట్ బంద్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్ బుధవారం బంద్ చేయనున్నట్లు కూరగాయల మార్కెట్ వర్తక అసోషియేషన్ ఒక ప్రకటనలో తెలిపారు. కూరగాయల వ్యాపారి శ్రీపతి రమేశ్ మృతికి సంతాపంగా, మార్కెట్ బంద్ చేస్తున్నట్లు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

• నేటి నుంచి ఆస్తి పన్నుల భువన్ సర్వే

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో జూన్ 18నుంచి ఆగష్టు 1వరకు ఆస్తిపన్నుల భువన్ సర్వే నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 100రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపల్ కార్యాలయ బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు సందర్శించనున్నట్లు, వారికి సహకరించగలరని పేర్కొన్నారు. వ్యాపార, వాణిజ్య సముదాయాల నిర్వాహకులు ఆయా షాపులకు సంబంధించిన ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని, లేకుంటే షాపును నిబంధనల ప్రకారం సీజ్ చేయనున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు.

• 18, 19న ప్రభుత్వ క్రీడాపాఠశాలల ప్రవేశ పరీక్ష

నెన్నెల/బెల్లంపల్లి: తెలంగాణ ప్రభుత్వ క్రీడాపాఠశాలల్లో ప్రవేశం కోసం ఈ నెల 18న నెన్నెలలో, 19న బెల్లంపల్లి మండల స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు జె.పోచయ్య, చంద్రశేఖర్‌రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరంలో హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూళ్లలో 4వ తరగతిలో ప్రవేశానికి గాను ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బెల్లంపల్లి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో, నెన్నెల జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందన్నారు. విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో సకాలంలో హాజరుకావాలని కోరారు.

• నేడు విద్యుత్ వినియోగదారుల సమావేశం

లక్సెట్టిపేట: ఈ నెల 18న మండల కేంద్రంలోని విద్యుత్‌ కార్యాలయం ఆవరణలో లక్సెట్టిపేట, జన్నారం, దండేపల్లి మండలాల విద్యుత్ వినియోగదారుల సమావేశం నిర్వహిస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సమావేశం నిర్వహిస్తున్నామని, సమస్యలున్న వినియోగదారులు ఉదయం 10గంటలకు కార్యాలయానికి వచ్చి సమస్యలు తెలియపర్చుకోవచ్చన్నారు. ఈ సమావేశానికి సభ్యులు నారాయణ, రామకృష్ణ, కిషన్, రాజగౌడ్ హాజరవుతున్నారని తెలిపారు.

• సీపీఐ పట్టణ కౌన్సిల్ కార్యవర్గం



పట్టణ కార్యదర్శి ఖలిందర్ అలీఖాన్

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో పట్టణ కౌన్సిల్ కార్యవర్గం ఎన్నికలను సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల దాసు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శిగా ఖలిందర్ అలీఖాన్, సహాయ కార్యదర్శిగా చాడా మహేందర్ రెడ్డి, 13మంది కౌన్సిల్ సభ్యులను, ఏడుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం



భీమారం: అక్షరాభ్యాసం చేయిస్తున్న డీఏవో కల్పన

భీమారం: పిల్లలను విధిగా సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి(డీఏవో), ప్రత్యేక అధికారి కల్పన తల్లిదండ్రులను కోరారు. 'అమ్మమాట–అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇప్పలబొగుడ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. చిన్నపిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిస్తే పౌష్టికాహారంతో పాటు చదువు నేర్పిస్తారని తెలిపారు. ఎంపీడీవో మధుసూధన్, ఎంఈవో గోపాల్‌రావు, ఉమెన్ హబ్ ఆఫీసర్ లిప్సిక, అంగన్‌వాడీ టీచర్ పెండ్రి స్వప్న పాల్గొన్నారు.

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ గ్రామ పంచాయతీ అంగన్‌వాడీ కేంద్రంలో 'అమ్మమాట–అంగన్‌వాడీ బాట' నిర్వహించగా జిల్లా సంక్షేమాధికారి రౌఫ్‌ఖాన్ హాజరయ్యారు. చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఇందిరా, విష్ణుప్రియ, పుష్పలత, ప్రసన్న, రమ, సుజాత, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని తిరుమలపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు.కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, ఉపాధ్యాయుడు అంబారావు, అంగన్‌వాడీ టీచర్ లలిత, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాండూర్: తాండూర్ మండలం మాదారం–3 ఇంక్లైన్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సువర్ణ, తిరుమలేశ్వరి, లక్ష్మి, ఏఎన్ఎం స్రవంతి, చిన్నారులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఏవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో ఏవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తొట్ల మల్లేష్ యాదవ్, చింతకింది మధుసూదన్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసే జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇళ్ల స్థలాల కేటాయింపులో మొండివైకరి అవలభిస్తుందన్నారు. ఆలస్యం చేయకుండా ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అక్రిడిటేషన్ కార్డులు స్టిక్కర్ల విధానంతో పునరుద్ధరించకుండా అర్హులైన జర్నలిస్టులకు కొత్త కార్డులు జారీ చేయాలని, జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించాలని కోరారు. కరోనా సమయంలో ఆగిపోయిన రైల్వే పాసులను పునరుద్ధరించాలని, తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. సమస్యలపై పోరాడేందుకు సంఘం తరుపున త్వరలో ఉద్యమ కార్యాచరణ చేపడుతామన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కోశాధికారి క్యాతం రాజేష్, ఉపాధ్యక్షులు గొర్రె లక్ష్మణ్, అరికెళ్ల జీవన్ బాబు, అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో సీటు సాధించిన సీవోఈ విద్యార్థి



సాయిచరణ్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీవోఈ) పాఠశాల విద్యార్థి జవహర్ నవోదయ విద్యాలయంలో సీటు సాధించాడు. సీవోఈ పాఠశాలలో దారిశెట్టి సాయిచరణ్ అనే విద్యార్థి ఐదో తరగతిలో ప్రవేశం పొంది పదో తరగతి వరకు చదువుకున్నాడు. జూనియర్ ఇంటర్‌లో ప్రవేశం కోసం జవహర్ నవోదయ విద్యాలయం నిర్వహించిన ప్రవేశపరీక్షలో సాయిచరణ్ ఉత్తమ మార్కులు తెచ్చుకొని, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో సీటు సాధించాడని సీవోఈ ప్రిన్సిపాల్ ఆకిడి విజయ్ సాగర్ తెలిపారు. తమ విద్యార్థి ప్రతిష్టాత్మకమైన నవోదయ విద్యాలయంలో సీటు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. పుష్పగుచ్ఛం అందజేసి వైస్ ప్రిన్సిపాల్ గోపి, అధ్యాపక బృందం అభినందించారు.

రక్తదానానికి ముందుకు రావాలి

మంచిర్యాలటౌన్: రక్తదానం చేసేందుకు ప్రజలు ముందుకు రావాలని మంచిర్యాల నగరపాలక సంస్థ మేనేజర్ విజయ్‌కుమార్ అన్నారు. ఈ నెల 2వ తేదీ నుంచి ప్రభుత్వం కార్పొరేషన్ పరిధిలో 100రోజుల కార్యాచరణ ప్రణాళిక 'ఒక మార్పు–అభివృద్ధికి మలుపు' అనే నినాదంతో పలు కార్యక్రమాలను నిర్వహిస్తుండగా, మంగళవారం రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్ వారి సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ అధికారులతో పాటు, సిబ్బంది 50మంది రక్తదానం చేశారు. అనంతరం మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు స్వయంగా తయారు చేసిన పలు ఉత్పత్తులతో మేళాను నగరపాలక సంస్థ కార్యాలయం ఆవరణలోనే నిర్వహించారు. ఈ మేళాలో ఫుడ్ మేళా, బుట్టలు, క్లాత్ బ్యాగులు, లేడీస్ పర్సులను తయారు చేసిన స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ రాజ మనోహర్, శానిటరీ ఇన్స్‌స్పెక్టర్ యం.వైకుంఠం, రెవెన్యూ అధికారి శ్రీనివాస రెడ్డి, జేఏవో అనితదేవి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ప్రశాంత్, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ మెప్మా టీయంసీ చంద్రయ్య, సీవోలు అరుణ, సరోజ, సుజాత, ఎస్‌హెచ్‌జీ సిబ్బంది, రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ మహేందర్, సభ్యులు సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ సురేశ్ బాబు పాల్గొన్నారు.

స్కూల్ బస్సులు తనిఖీ

దండేపల్లి: మండలంలోని మేదరిపేట, కన్నెపల్లి ప్రైవేట్ పాఠశాలల బస్‌లను పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సై తహసీనొద్దీన్ మంగళవారం తనిఖీలు చేశారు. బస్‌ల కండీషన్స్, ధ్రువపత్రాలు పరిశీలించడంతో పాటు, లైసెన్స్‌లు తనిఖీ చేశారు. హెల్పర్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. బస్సుల్లో పాఠశాలల కాంటాక్ట్ నంబర్లు రాసి ఉంచాలన్నారు. ప్రథమ చికిత్స కిట్స్ కూడా అందుబాటులో పెట్టాలన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు.

అటెన్షన్ ప్లీజ్.. రోడ్డుపై మురుగు..!



భీమారం: మండలంలోని మద్దికల్ గ్రామపంచాయతీ పరిధిలోని నేరేడుపల్లిలో మురుగునీళ్లు రోడ్డుపై ప్రవహిస్తుండంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు, వ్యర్థాలు రోడ్లపై చేరుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీ నిర్మించాలని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో అదికారులు చర్యలు తీసుకోవాలని, రోడ్లపైకి ఎక్కిన నీటిని తాత్కాలికంగా కాలువలు తవ్వి అందులోకి మళ్లించాలని, డ్రెయినేజీలు నిర్మించాలని కోరుతున్నారు.

సంబంధిత అధికారి : సతీశ్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి ఫోన్ నంబర్ : 98483 84636

సంక్షిప్త వార్తలు

• టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడికి సన్మానం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా టీబీజీకేఎస్ నూతన ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన బండి రమేశ్‌ను బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. నస్పూర్‌కాలనీలోని ఆ పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య ఆధ్వర్యంలో బండి రమేశ్‌ను శాలువతో సత్కరించారు. యూనియన్ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి మెరుగు పవన్‌కుమార్, మాజీ కౌన్సిలర్ వంగ తిరుపతి, పార్టీ నాయకులు గోగుల రవీందర్ రెడ్డి, ఆకునూరి సంపత్, బాకం నగేష్, గుమ్మడి శ్రీనివాస్, రఫీక్ ఖాన్, దగ్గుల మధు, కాటం రాజు, భాను చందర్, యూనియన్ నాయకులు పోగాకు రమేష్ పాల్గొన్నారు.

• దేశం ఎంతో అభివృద్ధి చెందింది..

దండేపల్లి: భారత ప్రధాని నరేంద్రమోదీ 11ఏళ్ల పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. దండేపల్లి పార్టీ కార్యాలయంలో మంగళవారం మోదీ పదకొండేళ్ల పాలనగురించి వివరించారు. నాయకులు పాల్గొన్నారు.

• యోగాపై అవగాహన

మంచిర్యాలఅర్బన్: స్థానిక సాంఘిక గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం దశాబ్ది వేడుకల్లో భాగంగా మంగళవారం భూమి–ఆరోగ్యం కోసం యోగా అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనూష, వైస్ ప్రిన్సిపాల్ సునీత, అకాడమిక్ కో–ఆర్డినేటర్ రిజ్వాన, పీడీ అరుంధ, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మి, మెడికల్ ఆఫీసర్ పద్మజ పలువురు పాల్గొన్నారు.

• ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు...

మందమర్రిరూరల్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని మందమర్రి ఎస్సై రాజశేఖర్ పేర్కొన్నారు. స్థానిక సాయిబాబా గుడి కూడలి వద్ద కోల్ బెల్ట్ రహదారిపై మంగళవారం విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించిన వాహనదారులకు అభినందనలు తెలిపి, మామిడి పండ్లు పంపిణీ చేశారు. ఏఎస్సై మల్లేశ్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

• ఎన్నిక

నస్పూర్: పట్టణ ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అ సంఘం సభ్యులు నస్పూర్ కాలనీకి చెందిన పులి రాజేందర్‌గౌడ్‌ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. పలువురు డ్రైవర్లు, ఓనర్లు పాల్గొన్నారు.